RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 184 | జూన్ 17, 2025 | వెల : రూ.3-00



కన్న తల్లిదండ్రుల చేత కూతురు కిడ్నాప్

3లో..



# సొంతిల్లు పేదవారి ఆత్మగౌరవ ప్రతీక

■ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



సొంతిల్లు పేదవారి ఆత్మగౌరవ ప్రతీక అని, వారి కలలను సాకారం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ నగరం ఓ సిటీ లోని మంత్రి క్యాంప్ కార్యాలయ ఆవరణలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఉత్తర్వుల జారీ చేసే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావులతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లో అందిస్తామని పేదవారికి అందజేయలేదని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రతి నిరుపేద బిడ్డకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేస్తూ, ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధికి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అందులో 1659 ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వుల పత్రాలను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అత్యంత నిరుపేద అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శకంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి

మిగతా 4వ పేజీలో..



వరి దిగుబడిలో తెలంగాణ

# టాప్



## పంజాబ్‌ను అధిగమించాం.. ● 'రైతు నేస్తం' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

గత సీఎం అందినకాడల్లా అప్పులు చేసి రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేని పరిస్థితికి దిగజార్చారని మండి పడ్డారు. రిటైర్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి రైతు నేస్తం కార్యక్రమన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 1,034 రైతు వేదికల్లో రైతు నేస్తం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, ఇంకా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక నుంచి ప్రతి మంగళవారం రైతునేస్తం ద్వారా శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ట్లాడుతూ, సర్పంచ్‌లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టింది గత ప్రభుత్వమేనని అన్నారు. నేను సీఎం అయ్యేనాటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయలేకపోతే మేం ఆరు నెలల్లోనే చేసి చూపించామని అన్నారు. వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే అని ఆనాడు పెద్దమనిషి చెప్పారని..రైతులను వరి వేయొద్దని చెప్పిన పెద్దమనిషి తన ఫామ్‌హౌస్‌లో 150 ఎకరాల్లో వరి వేశారని, తన ఫాంహౌస్‌లో పండించిన వారిని క్వింటాల్‌కు రూ.4 వేల చొప్పున అమ్ముకున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదు, ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యం పక్కదారి పట్టిందని వివరించారు. సన్నబియ్యం తినే ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు. రాష్ట్రానికి సరిపడా సన్నబియ్యం కావాలంటే సన్నవడ్ల సాగును ప్రోత్సహించాలని భావించామని వివరించారు. అందుకే క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ సన్నవడ్ల సాగను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మన రైతులు పండించిన సన్నవడ్లే సన్నబియ్యంగా పేదల కడుపు నింపుతోందన్నారు. వరి దిగుబడిలో ఇవాళ పంజాబ్‌ను అధిమించి తెలంగాణ నంబర్‌వన్‌గా ఎదిగిందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగిలిన పథకాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. పదేళ్ల పాటు వ్యవసాయ పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం మళ్లీ వ్యవసాయ పరికరాలు, డ్రిప్‌ను ఇస్తో ఉంది. రైతులు వ్యవసాయంలో సోలార్ పంపుసెట్లను ఉపయోగించాలని సూచించారు. భూములకు అనుకూలమైన పంటలనే రైతులు పండించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.కాగా నేటి నుంచి రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లోకి జమ అవ్వనున్నాయి. ఈ ప్రక్రియ 9 రోజుల పాటు జరగనుంది. ఎకరాలవారీగా కాక అందరికీ రైతుభరోసా డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. కోటి 49 లక్షల 35 వేల ఎకరాలకు రైతుభరోసా నిధులు విడుదల చేశారు.

వందల కేసులు పెట్టినా..

# భయపడం

■ ఒకటే ప్రశ్న తిప్పితిప్పి అడిగారు.. అరెస్టు చేస్తే చేసుకోండి

■ జైలులో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు: కేటీఆర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



రేవంత్ రెడ్డి జైలుకెళ్లినందుకు, మమ్మల్నీ కూడా జైల్లో పెట్టాలని చూస్తున్నారని మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను సుమారు 8 గంటలపాటు ఏసీబీ ప్రశ్నించింది. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని ఏసీబీ అధికారులు కేటీఆర్ కు తెలిపారు. అనంతరం విచారణ ముగియడంతో తెలంగాణ భవన్ కు కేటీఆర్ వెళ్లారు. కేటీఆర్ రాకతో తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. అక్కడ బాణాసంచా కాల్చి బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ భవన్ కు వెళ్లిన కేటీఆర్, అక్కడ హరీశ్ రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు.

రేవంత్ రెడ్డి మమ్మల్ని జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. తనను అరెస్ట్ చేస్తే చేసుకోండని ఏసీబీ అధికారులకు చెప్పానని, అదే చేసి ఉంటే జైల్లో విశ్రాంతి తీసుకుంటానని తెలిపారు. ఇలా తనపై వందల కొద్దీ కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా భయపడేది లేదని కేటీఆర్ తేల్చి చెప్పారు.చట్టంపై గౌరవంతో ఎన్ని సార్లు పిలిచిన వెళ్లానని, ఉదయం నుంచీ ఒకటే ప్రశ్న తిప్పి తిప్పి అడిగారని మండిపడ్డారు. అసలు ఈ కేసులో అవినీతి ఎక్కడ ఉందని ఏసీబీ అధికారులనే తానే ప్రశ్నించినట్లు తెలిపారు. జైలు కేసులు కొత్త కాదు.. గతంలో తెలంగాణ ఉద్యమంలో కూడా జైలుకు వెళ్లొచ్చాను అన్నారు. ఫార్ములా-ఈ రేసులో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ చేశామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు..వాగ్దానాలు నెరవేరే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇచ్చిన 420 హామీలు దొంగ ఆరు గ్యారెంటీలు, మీరిచ్చిన డిక్లరేషన్లు ఇవ్వాల్సిందే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తోందని సంకేతాలు వస్తున్నాయని రాష్ట్ర ప్రజలందరూ రేవంత్ రెడ్డి తీరును గమనిస్తున్నారన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ పెట్టి, ఇప్పుడు వాటిని విస్మరించి స్థానిక సంస్థలకు వెళ్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. వీటిని బీసీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రైతుబంధును ఎలక్షన్ బందుగా మార్చి ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రైతుబంధు వేస్తున్న విషయాన్ని రైతులు గమనిస్తున్నారన్నారు. నెలకు రూ.2500 ఎగ్గొట్టిన విషయాన్ని మహిళలు గమని స్తున్నారు..రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నువ్వు చేసిన మోసాన్ని నిరుద్యోగులు యువత గమనిస్తున్నారు..మీ దగ్గర

మిగతా 4వ పేజీలో..



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

■ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వినతులు పెండింగ్ లో ఉండకుండా యేవారానికి ఆవారం అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కాగా సోమవారం ప్రజావాణిలో మొత్తం 111 ఫిర్యాదులు స్వీకరించారు.అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి 58 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆదనపు కమిషనర్ జోనా, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, సెక్రటరీ అలీ వేలు, ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏం హెచ్ఓ డా.రాజేష్, టిఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వానాకాలం పంటలకు సిద్ధమవుతున్న రైతులు..!

■ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని చోట్ల ఇటీవల వర్షాలు కురిశాయి.దాంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వానాకాలం పంటలకు సిద్ధమయ్యారు. దుక్కులు దున్నుకొని విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. నల్గొండ జిల్లా పరిధిలోని పలు మండలాల్లో ఇటీవల కురిసిన మోస్తారు వర్షాలకు రైతులు భూములను దుక్కి దున్ని చదును చేసుకున్నారు. సీజన్ ప్రారంభ కావడంతో రైతులు తమ పంట పొలాల్లో పత్తి విత్తనాలను నాటేందుకు ముందుగానే పత్తి గింజలను కొనుగోలు చేసుకున్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రైతులు చదును చేసుకున్న పంట పొలాల్లో పత్తి గింజలను పెట్టారు.దీంతో ఇటు రైతులు, అటు కూలీలు వ్యవసాయ పనుల్లో

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

మంగళవారం, జూన్ 17, 2025

# భారత్ కొత్త వ్యూహం

- జమ్మూకశ్మీర్ నుంచి 113 కి.మీ.ల భారీ కాలువ.. సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- సింధు నీళ్లు పాక్‌కు వెళ్లకుండా.. సింధూ నది నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు సాగునీరు
- మూడేళ్లలో రాజస్థాన్‌కు నీరందిస్తామని కేంద్రమంత్రి అమిత్ షా వెల్లడి



**వేద న్యూస్, డెస్క్:**

సింధు జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా భారత ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. జమ్మూకశ్మీర్‌లోని అదనపు జలాలను పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు తరలించేందుకు 113 కిలోమీటర్ల పొడవైన కాలువను నిర్మించాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని ప్రారంభించింది. తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ నదుల పూర్తి వినియోగంతో పాటు, సింధు జలాల ఒప్పందం ప్రకారం పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ నదుల నుంచి భారత్‌కు కేటాయించిన వాటాను సంపూర్ణంగా వాడుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఫలితంగా పాకిస్థాన్‌కు వెళ్లే అదనపు నీటి ప్రవాహం గణనీయంగా తగ్గనుంది. జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉయ్జ్ బహుళార్థ సాధక ప్రాజెక్టును (జలవిద్యుత్, సాగునీరు, తాగునీరు) కూడా పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. చీనాబ్ నదిని రావి-బియాస్-సట్లెజ్ నదులతో అనుసంధానించే ఈ ప్రతిపాదిత కాలువ, ఇప్పటికే ఉన్న కాలువ నిర్మాణాలను జమ్మూ, పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లలోని 13 ప్రాంతాలలో కలుపుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీని ద్వారా ఇందిరా గాంధీ కాలువకు (సట్లెజ్-బియాస్) నీటిని చేరవేయనున్నారు. ఈ పరిణామాలపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, "రాబోయే మూడేళ్లలో సింధు జలాలను కాలువల ద్వారా రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌కు తీసుకువెళ్తాం. దీనివల్ల దేశంలోని పెద్ద విస్తీర్ణంలో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయి, అదే సమయంలో పాకిస్థాన్ ప్రతి నీటి బొట్టు కోసం అల్లాడుతుంది" అని అన్నారు. ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, చీనాబ్ నదిపై ఉన్న బగ్లిహార్, సలాల్ జలవిద్యుత్ ప్రాజెక్టుల జలాశయాల పూడికతీత వంటి స్వల్పకాలిక చర్యలతో పాటు ఈ దీర్ఘకాలిక ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం చేపడుతోంది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పాకల్ దుల్ (1000 మెగావాట్లు), రాట్లే (850 మెగావాట్లు), కిరు (624 మెగావాట్లు), క్వార్ (540 మెగావాట్లు) వంటి జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా కూడా సింధు జలాలను మరింతగా వినియోగించుకోవాలని భారత్ భావిస్తోంది.

## 27 కోట్ల మంది చిన్నారులు బడికి దూరం!



**వేద న్యూస్, డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా పాఠశాల విద్యకు దూరంగా ఉంటున్న పిల్లల సంఖ్య ఆందోళనకర స్థాయిలో 27.2 కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో)కు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ బృందం తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది గత అంచనా కంటే 21 మిలియన్లు ఎక్కువ కావడం గమనార్హం. ప్రస్తుత అంచనాల ప్రకారం 2025 నాటికి వివిధ దేశాలు నిర్దేశించుకున్న జాతీయ విద్యా లక్ష్యాలకు దాదాపు 75 మిలియన్ల మేర వెనుకబడి ఉంటాయని జీఈఎం బృందం హెచ్చరించింది. ఈ గణాంకాలు ప్రపంచ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను స్పష్టం చేస్తున్నాయి. బడి బయట పిల్లల సంఖ్య ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదు కావడానికి గల కారణాలను కూడా నివేదిక విశ్లేషించింది. ఈ పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలున్నాయని తెలిపింది. మొదటిది, కొత్తగా సేకరించిన విద్యార్థుల నమోదు, హాజరుకు సంబంధించిన గణాంకాల వల్ల సుమారు 8 మిలియన్ల (38 శాతం) పెరుగుదల నమోదైందని పేర్కొంది. రెండోది, 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో సెకండరీ పాఠశాల వయసు బాలికల విద్యపై విధించిన నిషేధం కూడా ఈ పెరుగుదలకు గణనీయంగా దోహదపడిందని నిన్న విడుదలైన ఈ నివేదిక వివరించింది. ఈ గణాంకాలు ప్రపంచ దేశాలు తమ విద్యా విధానాలను సమీక్షించుకుని, సార్వత్రిక విద్య లక్ష్యాలను చేరుకోవడానికి మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలు, బాలికల విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## జనగణనకు గెజిట్ విడుదల

**వేద న్యూస్, డెస్క్:**

ఎంతోకాలంగా వాయిదాపడుతూ వస్తున్న జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభం కానున్నది. దేశంలో 16 ఏండ్ల తర్వాత చేపడుతున్న ఈ జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. కేంద్ర హెూం శాఖ ఈ గెజిట్‌ను విడుదల చేసింది. రెండు దశల్లో జరుగనున్న ఈ ప్రక్రియ మొత్తంగా 16వదికాగా, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన. 2027 మార్చి 1వ తేదీ నాటికి ఇది పూర్తి కానుంది. తొలి దశలో భాగంగా హిమాలయ ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026, అక్టోబర్ 1 నుంచి, రెండో దశలో భాగంగా 2027, మార్చి 1 నుంచి దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో జన గణనను చేపట్టనున్నట్లు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. ఈ సారి జనగణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుందని కేంద్ర హెూంశాఖ వెల్లడించింది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు పేర్కొంది. సెక్షన్ 3, జనగణన చట్టం, 1948 ప్రకారం జన-కులగణనను చేపట్టనున్నట్టు వివరించింది.

**- 16 ఏండ్ల తర్వాత..**

దేశంలో జనగణనను పదేండ్లకోసారి నిర్వహిస్తారు. చివరిసారిగా 2011లో ఈ ప్రక్రియను చేపట్టారు. రెండు విడుతల్లో ఈ ప్రక్రియ జరిగింది. వాస్తవానికి 2021లోనే జన గణనను నిర్వహించాలి. అయితే, కొవిడ్ కారణంగా ఈ ప్రక్రియ వాయిదా పడింది. అయితే, ఇప్పుడు 16 ఏండ్ల తర్వాత తొలిసారిగా జనాభా గణనను నిర్వహించనున్నారు. దీంతోపాటు తొలిసారిగా కులగణనను కూడా చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటే కులగణనను కూడా చేపట్టనున్నట్టు గత నెలలో కేంద్రం వెల్లడించడం తెలిసిందే. కాగా జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి ఇప్పటికే 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అందులో ఓ కొత్త ప్రశ్న కూడా ఉంది. అదే ఈ జనగణన ప్రత్యేకత.

## ఇరాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు



**వేద న్యూస్, డెస్క్:**


ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తూనే ఉంది. దాడుల తీవ్రతకు టెహ్రాన్‌లోని అనేక కీలక ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అధికారులు అత్యంత రహస్యంగా ఒక సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఈశాన్య టెహ్రాన్‌లోని ఒక పటిష్టమైన అండర్‌గ్రౌండ్ బంకర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నట్టు సమాచారం. గత శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఖమేనీ నివాసం, ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఉండే మోనిరియే ప్రాంతంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడినట్టు టెహ్రాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ పేలుళ్లు ఖమేనీ నివాసానికి చాలా దగ్గరగా సంభవించడంతో ఆయన భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో అధికారులు తక్షణమే స్పందించి అదే రోజు రాత్రి ఖమేనీని లావిజాన్ ప్రాంతంలో ఉన్న బంకర్‌కు తరలించినట్టు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. గతంలో కూడా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరినప్పుడు ఖమేనీ కుటుంబంతో సహా బంకర్‌లోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఇజ్రాయెల్ జరుపుతున్న ఈ భీకర దాడుల వల్ల ఇరాన్ వైపు భారీ నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా అనేక మంది కీలక సైనికాధికారులు, అణుశాస్త్రవేత్తలు ఈ దాడుల్లో మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ సైనిక దళాల పర్యవేక్షకుడైన జనరల్ మహమ్మద్ బాఘేరి, రెవల్యూషనరీ గార్డ్స్ అధిపతి మేజర్ జనరల్ హుస్సేన్ సలామీతో పాటు ఆ విభాగానికి చెందిన ఇంటెలిజెన్స్ చీఫ్ కూడా మృతిచెందిన వారిలో ఉన్నట్టు తెలిసింది.

## షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ ఫోన్..?

**వేద న్యూస్, డెస్క్:**

జిల్లాలోని షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ గత అర్ధరాత్రి దాటాక చెన్నై కమాండ్ కంట్రోల్‌కు ఫోన్ కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన నెల్లూరు జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రీహరి కోటలో ఈరోజు (సోమవారం) తెల్లవారుజాము నుంచి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ బలగాలు టీంలుగా ఏర్పడి షార్ చుట్టుపక్కల కూంబింగ్ నిర్వహిస్తు న్నారు. సముద్ర మార్గాల్లో కూడా కోస్టల్ గార్డ్స్ తనిఖీలు చేశారు. షార్ మొదటి గేటు, షార్ ఉద్యోగుల కాలనీలో నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. షార్‌లో బాంబులు పెట్టారు, తీవ్రవాదులు ఉన్నారంటూ చెన్నై కమాండ్ కంట్రోల్ రూంకు గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. అయితే ఇది ఆకతాయిల పనా, లేకపోతే నిజంగానే ఉందా అనేది అర్థంకాని పరిస్థితి. దీంతో బలగాలు అప్రమత్తమై షార్‌లో అణువణువునా గాలిస్తున్నారు. షార్ చుట్టూ నీరు ఉంటుంది. షార్‌లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గం మాత్రమే ఉంది. షార్‌లో రెండు వేల మంది వరకు సీఐఎస్ఎఫ్ జవాన్లు ఉంటారు. వారంతా కూడా అడవులను జల్లెడపడుతున్నారు. ప్రపంచ స్థాయిలో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ఎంతో వేగంగా దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందా అని భావిస్తూ పెద్ద ఎత్తున సీఐఎస్ఎఫ్ జవాన్లు అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. కంట్రోల్ రూంలు, అక్కడ ఉండే పలు కాలనీలను కూడా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు సముద్రమార్గం ద్వారా ఎవరైనా చొరబడ్డారా అనే అనుమానంతో అక్కడ కూడా ప్రత్యేకమైన బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తీవ్రవాదులు ఉన్నారనే కాల్ రావడంతో షార్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిజంగా తీవ్రవాదులు చొరబడ్డారా లేదా అనే దానిపై విస్తృతంగా సోదాలు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు ఎవరినీ కూడా లోపలికి పంపించకుండా మెయిన్ గేటు వద్దే క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నానికి దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే షార్‌లోకి తీవ్రవాదులు చొరబడే అవకాశాలు లేవు. షార్ చుట్టూ కూడా మత్స్యకారుల గ్రామాలు, దీవులు ఉన్నాయి. ఈ గ్రామ ప్రజలు చేపల వేటతో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు వస్తే వెంటనే షార్‌లోని సీఐఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చారా అనేదానిపై మత్స్యకార ప్రజలను కూడా పోలీసులు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో షార్ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

## టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హతతో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు



**వేద న్యూస్, డెస్క్:**

ఉమ్మడి కర్నూలు జిల్లా నిరుద్యోగులకు అలర్ట్. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారా? అయితే ఇది మీకోసమే. ఎలాంటి పరీక్ష లేకుండా ఉద్యోగ అవకాశం లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. యువతకు ఉపాధి ధ్యేయంగా ప్రత్యేకంగా రూపొందించిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా జిల్లాల వారీగా పదవ తరగతి మొదలుకొని ఆపై చదువులు చదివి ఉద్యోగం కోసం ఎదురు చూసే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తూ కొన్ని వందల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లా పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి. సోమశివారెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో 16 ప్రముఖ కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు పాల్గొంటున్నాయి.

## మంగళగిరికి కొత్త రైల్వే లైన్..!

**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి ప్రధాన కేంద్రంగా ఉన్న గుంటూరుకు వచ్చే రైళ్ల రాకపోకలు భవిష్యత్తులో పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీ పెరిగితే వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్తగా పేరేచర్ల-మంగళగిరి మధ్య రైల్వేలైన్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే నల్లపాడు నుంచి బీబీనగర్ వెళ్లే రెండు లైన్ల మార్గం క్రాసింగ్ వద్ద ఆర్‌వోఆర్ వంతెన నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ వంతెన కింది నుంచి, అదే విధంగా పైనుంచి రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. ఇటువంటిది క్రాసింగ్ ఇటీవలే గూడూరు వద్ద నిర్మించారు. మొత్తం 35 కిలో మీటర్ల రైల్వేలైన్, వంతెన నిర్మాణానికి సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఈనెల 13వ తేదీన గుంటూరులో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ ప్రాజెక్టు గురించి ప్రత్యేకంగా చర్చించారు. సర్వే పనులు వేగంగా చేయాలని అధికారులకు సూచించారు.

# నడవలేని స్థితిలో చిరుత

- కర్నూలు జిల్లా కోసిగి మండల సమీపంలో ఎర్రవంకలో చిరుత పులి సంచారం కలకలం
- చిరుత అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించిన అధికారులు

**ఇంటర్నెట్ డెస్క్:**



కర్నూలు జిల్లాలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. కోసిగి మండల కేంద్రానికి సమీపంలో ఎర్రవంకలో చిరుత ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద ఎత్తున పులిని చూసేందుకు ఎగబడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుత పులి ఉన్న ప్రాంతం నుంచి ప్రజలను దూరంగా పంపించేశారు. చిరుత అనారోగ్యంగా ఉండటంతో పరుగెత్తలేని పరిస్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇదే సమయంలో చిరుత ఓ రైతుపై తన పంజా విసిరింది.కర్నూలు జిల్లాలోని కోసిగి తిమ్మప్ప, బసవన్న కొండల్లో చిరుతపులులు సంచరిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం బసవన్న కొండ వెనకనున్న ఎర్ర వంకలో ఓ చిరుత కనిపించింది. అయితే ఇది అనారోగ్య సమస్యతో పరుగెత్తడం చేతకాకపోవడంతో యువకులు, ప్రజలు దాన్ని వీడియోలు, ఫొటోలు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్సై హనుమంతరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, చిరుత వద్దకు జనం వెళ్లకుండా చెదరగొట్టారు. సమాచారం అందించి 2 గంటలు అయినా అటవీ శాఖ అధికారులు రాకపోవడంతో తొలుత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.చిరుతను చూసేందుకు ఇతర గ్రామాల నుంచి ప్రజలు సైతం పెద్దఎత్తున కోసిగికి తరలివచ్చి తిలకించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు వచ్చి చిరుతను చూస్తూ నిల్చుండి పోయారు. దీంతో ఇక స్థానిక రైతులు వీరేశ్, తిమ్మయ్య, మాదేవ, చిన్నోడు, మరో ముగ్గురు ధైర్యం చేసి వలతో చిరుత పులిని బంధించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వలలో బందిస్తున్న క్రమంలో చిరుత పంజాతో యువ రైతు వీరేశ్‌పై దాడి చేయడంతో అతని కాలుకు తీవ్ర గాయమైంది. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారులు శ్యామల, స్క్వాడ్ అధికారి రవికుమార్, ఆదోని రేంజ్ అధికారిణి తేజస్విలపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి పత్తి పంటలో ప్రజలు ఇష్టానుసారంగా తొక్కడంతో తమ పంటంతా నాశనమైందని, సంబంధిత రైతులకు నష్టపరిహారం అందించాలంటూ అటవీ శాఖ అధికారుల జీపు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. మరోవైపు చిరుతకు ఆదోని అటవీశాఖ ఆఫీసులో ప్రాథమిక చికిత్స అందించి, తిరుపతి జూపార్క్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

# కన్న తల్లిదండ్రులే.. కూతురిని కిడ్నాప్

**వేద న్యూస్, డెస్క్:**




అనంతపురం జిల్లాలోని కంబదూరు మండలం కురాకులపల్లిలో కిడ్నాప్ కలకలం రేపింది. కన్న తల్లిదండ్రులే కూతురిని కిడ్నాప్ చేశారు. ఎస్జీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతి ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. భర్తతో కలిసి యువతి బైక్‌పై వెళ్తుండగా కిడ్నాప్ చేశారు. పథకం ప్రకారం 11 మందితో కలిసి యువతిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్‌ను పోలీసులు ఛేధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉన్న తిరుపతమ్మ అనే యువతిని సొంత కుటుంబసభ్యులే కిడ్నాప్ చేశారు. ఆస్తి కోసం కిడ్నాప్ చేయడంతో పాటు కుటుంబసభ్యుల ఆమోదం లేకుండా మరొకరిని వివాహం చేసుకుందనే ఆగ్రహంతో తిరుపతమ్మను కిడ్నాప్ చేసి బెంగళూరుకు తరలించారు. బెంగళూరులోని బంధువుల ఇంట్లో ఉంచారు. తిరుపతమ్మ పేరు మీద ఉన్న ఆస్తులను కుటుంబసభ్యులపై ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఆస్తులను రాసియ్యకపోతే చంపుతామంటూ కూడా తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగారు. దీంతో మీరు చెప్పినట్టుగానే ఆస్తులను ట్రాన్స్‌ఫర్ చేస్తానని, కళ్యాణదుర్గం వెళ్లాక తన పేరుతో ఉన్న ఆస్తులతో పాటు ఇతరత్రా ఆస్తులను కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తానంటూ కుటుంబసభ్యులకు చెప్పింది యువతి. అందులో భాగంగా బెంగళూరు నుంచి కళ్యాణదుర్గంకు తిరుపతమ్మను కుటుంబసభ్యులు తీసుకువచ్చారు.అయితే అప్పటికే తిరుపతమ్మ కిడ్నాప్ కేసు నమోదు అవడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఓ వాహనంలో యువతితో పాటు కుటుంబసభ్యులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌పై పోలీసులు లోతుగా విచారించడంతో కిడ్నాప్ వెనక ఉన్న తతంగం మొత్తాన్ని కూడా వెలికి తీశారు. తిరుపతమ్మ తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులే ఆస్తి కోసం ఆమెను కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

**- తల్లిదండ్రుల ప్రవర్తనతో విసిగిపోయిన సదరు యువతి**

'యువతికి 32 సంవత్సరాలు వచ్చినప్పటికీ తల్లిదండ్రులు పెళ్లి చేయలేదు. కూతురికి పెళ్లి చేస్తే జీవనాధారం పోతుందని భావించిన వారు పెళ్లి చేయకుండా ఇంటి వద్దే ఉంచుకున్నారు. పెళ్లి చేయమని స్వయంగా అమ్మాయి అడిగితే వాళ్ల చెల్లెలి భర్తను పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో తల్లిదండ్రుల ప్రవర్తనతో విసిగిపోయిన సదరు యువతి తనను 20 ఏళ్లుగా ప్రేమిస్తున్న చిన్ననాటి మిత్రుడు తిప్పేస్వామిని పెళ్లి చేసుకుంది. కుమార్తె వివాహ విషయం తెలుకున్న తల్లిదండ్రులు ఆమెపై కక్షతో కిడ్నాప్ చేయాలని ప్రణాళిక చేశారు. అనుకున్న ప్రకారం పక్కా పథకంతో కూతురును కిడ్నాప్ చేసి బంధించారు. కూతురిని హింసించి ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డును లాక్కున్నారు. ఆస్తి రాసివ్వాలని బెదిరించారు' అని పోలీసులు తెలిపారు. యువతిని కిడ్నాపర్ల చెర నుంచి విడిపించామని.. వారి వద్ద నుంచి కత్తి, బైక్‌ను సీజ్ చేసినట్లు కాప్స్ వెల్లడించారు.

# హనీమూన్ హత్య కేసులో మరో దిమ్మతిరిగే ట్విస్ట్



- హనీమూన్ హత్య కేసులో ఎప్పటికప్పుడు సరికొత్త ట్విస్టులు

**వేద న్యూస్, డెస్క్:**


రాజా రఘువంశీ హనీమూన్ హత్య కేసులో ఎప్పటికప్పుడు సరికొత్త ట్విస్టులు తెరపైకి వస్తున్నాయి. వివాహేతర సంబంధం వల్లే తాను పెళ్లి చేసుకున్న రాజా రఘువంశీని సోనమ్ హత్య చేసినట్టు అంతా భావించారు. ఇప్పటివరకు ఈ కోణంలోనే పోలీసుల విచారణ జరుగుతూ వచ్చింది. అయితే తాజాగా ఈ కేసుకు సంబంధించి హవాలా లావాదేవీలు బయటపడటం మరింత ఇంట్రెస్టింగ్‌గా మారింది. కేసులో ప్రధాన నిందితులైన సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ్ మొబైల్ ఫోన్లలో హవాలా లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాలు వెలుగుచూశాయి. దీంతో లవ్ క్రైమ్ స్టోరీలో ఆర్థిక నేరం కోణం కూడా కనిపిస్తోంది. రాజ్ కుష్వాహ్ మొబైల్ ఫోన్‌లో పలు పాస్‌వర్డ్‌లు, చిరిగిన నోట్లు , హవాలా లావాదేవీల ఆధారాలు లభించాయి. అందులో పాత 10 రూపాయల నోట్ల ఫోటోలు కూడా దొరికాయని, వీటిని హవాలా లావాదేవీలలో ఉపయోగిస్తారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు రాజ్, సోనమ్ , గోవింద్‌తో వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు విచారణలో ఒప్పుకున్నట్టు తెలిసింది. సోనమ్ రాజ్ ద్వారా రూ. 50,000 హంతకుడికి పంపారని.. ఇది హవాలా నెట్‌వర్క్‌కు చెందినదిగా భావిస్తున్నారు. నిందితుడు సోనమ్ సోదరుడు గోవింద్‌తో కలిసి వ్యాపారం చేసినట్టు గుర్తించారు. ఈ వ్యాపారంలో హవాలా లావాదేవీలు జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సోనమ్ కుటుంబానికి సమీప బంధువైన జితేంద్రకు చెందిన ఖాతాల ద్వారా సోనమ్, గోవింద్ రహస్య లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. కొన్ని ఖాతాల్లో రూ. 14 లక్షల వరకు విత్ డ్రా, డిపాజిట్‌లు ఉన్నట్టు గుర్తించారు. ఇండోర్ క్రైమ్ బ్రాంచ్ హవాలాకు సంబంధించిన అన్ని పత్రాలు, డిజిటల్ డేటా , నగదు లావాదేవీ వివరాలను ఈడీకి అందజేసింది. మరోవైపు ఈ వ్యవహారంలో నిజానిజాలు తెలుసుకునేందుకు సోనమ్, రాజ్ కుష్వాహ్‌కు నార్కో పరీక్షలు నిర్వహించాలని రాజా కుటుంబం డిమాండ్ చేసింది.

మరోవైపు వేగంగా తన వ్యాపారాన్ని విస్తరించిన గోవింద్ సంపాదనపై కూడా ఇప్పుడు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అతడు హవాలా వ్యాపారంలో పాల్గొన్నాడని , తెరవెనుక అక్రమ లావాదేవీలు చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులతో పాటు %జుణ% బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. రాజా రఘువంశీ హత్య కేసులో మొదట ప్రేమ వ్యవహారం, ఆపై వేరే యువకుడితో యువతి సంబంధమే కారణమని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు వెలుగుచూస్తున్న కొత్త విషయాలతో రఘువంశీ మర్డర్ కేసులో హవాలా వ్యవహారం కూడా కీలక పాత్ర పోషించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## సెర్ప్‌కు 25 ఏళ్లు..

# సీఎం చంద్రబాబు ప్రశంసలు

**వేద న్యూస్, అమరావతి :**



గ్రామాల ఆర్థిక అభివృద్ధి కోసం, గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తీసుకొచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను మహిళలు ఓ ఉద్యమంలా తీసుకెళ్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. తొలుత వెలుగు అనే ఓ కార్యక్రమాన్ని చేపట్టగా.. అది కాలక్రమేనా సెర్ప్‌గా రూపాంతరం చెందిందన్నారు. సెర్ప్‌ను తీసుకొచ్చి నేటికి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గ్రామీణ మహిళలకు, సెర్ప్ ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు. 'సరిగ్గా 25 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అనే ఒక మారుమూల ప్రాంతంలో వెలుగు అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే ఆనాటి ప్రాజెక్టు లక్ష్యం. అది కాలక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి లక్షలాది గ్రామీణ మహిళల జీవితాలలో, వేలాది గ్రామాలలో నిరంతరం అభివృద్ధి వెలుగులు నింపుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనకు సెర్ప్ నిరంతరం కృషి చేస్తోంది. సెర్ప్ కార్యకలాపాలలో భాగస్వాములవుతూ... నవసమాజ నిర్మాతలై గ్రామీణ పేదరిక నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న గ్రామీణ మహిళలకు... వారిని ప్రగతి పథంలో నడిపిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# కోకాపేటలోని పబ్‌లో దాడులు..


**వేద న్యూస్, హైదరాబాద్ :**



రాష్ట్రంలోని పలు పబ్‌లపై ఎస్‌ఓటీ పోలీసులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నారన్న సమాచారంతో పలు పబ్‌లో ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేస్తున్నారు. తాజాగా కోకాపేట్‌లోని పబ్‌లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఎస్వోటీ పోలీసులు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు సమాచారంతో ఎస్‌ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా పబ్‌లలో దాడులు నిర్వహించారు. కోకాపేటలోని రాబిట్ హెూల్, మై క్యాప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో నార్సింగ్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇటీవల గచ్చిబౌలిలోని పలు పబ్బులపై కూడా ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్‌లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. క్లబ్ రోగ్, ఫ్రాట్ హౌస్ పబ్‌లో దాడులు జరిపిన ఎస్‌వోటీ పోలీసులు.. డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం నలుగురికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో ఫ్రాట్ హౌస్ పబ్ డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాదాపూర్, కొండాపూర్‌లో పలు పబ్‌లపై జరిపిన దాడుల్లోనూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని తేలింది. మాదాపూర్ అఖాన్ పబ్‌లో ఒకరికి, కొండాపూర్ ఏ19 పబ్‌లో మరొకరికి గంజాయ్ పాజిటివ్ అని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఇక.. తెలంగాణను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ యువత మాత్రం డ్రగ్స్ బారి నుంచి బయటకురాని పరిస్థితి. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తోంది యువత. మరోవైపు విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా ఈ దందాను నిర్వహిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు కూడా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాలు ఎన్నో. సెలబ్రెటీలను కూడా వదలకుండా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్లు, పబ్‌లు, హెటల్స్‌లలో తరచూ దాడులు చేస్తూ డ్రగ్స్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట డ్రగ్స్, గంజాయి సరఫరా కొనసాగుతూనే ఉంది.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంతో

# పెరిగిన జాగ్రత్తలు.!



- థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ379 విమానానికి బాంబు బెదిరింపు
- ఇటు సాంకేతిక సమస్యలు
- సాంకేతిక లోపం కారణంగా విమానం గంటల తరబడి ఆలస్యం

**వేద న్యూస్, డెస్క్:**

శంషాబాద్‌లోని స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన ఫ్లైట్ నెంబర్ -2138లో మొదట టెక్నికల్ సమస్య అని సిబ్బంది ప్రయాణికులకు తెలిపారు. దీంతో మూడు గంటల పాటు ప్రయాణికుల పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు ప్రయాణికులు భయంతో తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఇక దుబాయ్ విమానాశ్రయంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. సాంకేతిక లోపం కారణంగా విమానం గంటల తరబడి ఆలస్యమైంది. ఆ సమయంలో విమానంలో ఏసీ పని చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోల్లో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు స్పష్టంగా కనిపించింది. ఈ ఘటన జూన్ 13న చోటు చేసుకుంది.

ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఎయిరిండియా 1511 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలెట్ వెంటనే విమానాన్ని నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం భద్రతా కారణాలతో తిరిగి వెనక్కి వెళ్లింది. సుమారు రెండు గంటల ప్రయాణం అనంతరం బాంబు బెదిరింపు కారణంగా విమానాన్ని మళ్లీ ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చేరుకోవాల్సిన ఈ విమానాన్ని వెనక్కి మళ్లించారు. రెండు రోజుల క్రితం థాయ్‌లాండ్‌లో ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్ అయింది. థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ379 విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అందులో బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తేలిన తరువాత ప్రయాణానికి అనుమతిచ్చారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం అనంతరం అటు ప్రయాణికుల ఆందోళన, ఇటు విమానయాన సంస్థలు జాగ్రత్తలతో కొన్ని చోట్ల గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ం

వేద న్యూస్





## కురుమ కులస్తుల నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

కరీమాబాద్ బీరన్న గుడి ఆవరణలో కురుమ కులస్తుల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షులుగా కోరే కృష్ణ, ఉపాధ్యక్షులు కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, కోశాధికారి నరిగ లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, మండల కొమురెల్లి కోర కుమారస్వామి, బండారి రాజేశ్వర్, ఆర్గనైజర్స్ నంద నవీన్ కొట్టే, సదానందం, గుట్ట మల్లేశం, కార్యవర్గ సభ్యులు కంచ తిరుపతి, వాసవి శ్రీనివాస్, ఎమ్మె వేణు, కోరే రమేష్, అన్న శ్రీనివాస్, మురికి చిన్న, రవి, కంచ మెట్టయ్య, కొమ్ము రాజు, కాటన్ సతీష్, బండారి మల్లేశం ఎన్నుకోబడ్డారు. కాగా కుల పెద్దలు మండల రాజు, దయ్యాల పురుషోత్తం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



## నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు

**వేద న్యూస్,ఎల్కతుర్తి:**

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్‌ను కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు చౌల రామారావు, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు.. మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అధికారిగా హనుమకొండ జిల్లా ప్రజానీకానికి కలెక్టర్ స్నేహ చక్కటి సేవలు అందించాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## పేదోడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**వేద న్యూస్, నెక్కొండ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇల్లు లేని పేద ప్రజలకు సొంతింటి కల సహకారం అవుతుందని పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి అన్నారు.సోమవారం నెక్కొండ మండలం దీక్షకుంట, గొల్లపల్లి, అమీన్ పేట గ్రామంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరి ప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరు సాయి కృష్ణ, లౌడియా తిరుమల్, మాదాడు శ్రీనివాస్, కుసుమ చెన్నకేశవులు, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, చల్లా పాపిరెడ్డి, దీక్షకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెర్గు కుమార స్వామి, పులి నవీన్ రాంబాబు, అమీన్ పేట మాజీ సర్పంచ్ యాకయ్య, మాజీ ఎంపిటిసి పులి బాబు, డెక్క సాంబరాజు, గొల్లపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాదావత్ ప్రశాంత్, బంగారు మల్లేష్, జవహర్లాల్ తదితరులు పాల్గొన్నారు.

## భయపడం

**మొదటి పేజీ తరువాయి**

చెప్పుకోవడానికి సమాధానం లేక డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డి నడిపిస్తున్నాడని ఆరోపించారు. ఏదో ఒక కమిషన్ ఎంక్వయిరీ అంటూ కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్-బీజేపీ దొంగ నాటకాలు, దొంగ బాగోతం అంతా తెలంగాణ ప్రజలకు అంతా అర్థమయింది అని అన్నారు. ఒక కేసు కాదు ఇంకా వెయ్యి కేసులు పెట్టినా మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాం.. నువ్వు లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధం కావాలి అని అన్నారు. కాగా విచారణ సమయంలో కేటీఆర్ మొబైల్ సీజ్ చేసేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నం చేశారు. మొబైల్ తీసుకురాలేదని విచారణ అధికారులకు కేటీఆర్ చెప్పడంతో ఈ-రేసింగ్ సమయంలో వాడిన సెల్ఫోన్లు అప్పగించాలని ఆయనకు సూచించింది. ఈనెల 18లోపు రేసు సమయంలో వాడిన సెల్ఫోన్లు అప్పగించాలని ఏసీబీ ఆదేశించింది.

## వానాకాలం పంటలకు సిద్ధమవుతున్న రైతులు..!

**మొదటి పేజీ తరువాయి**

నిమగ్నమయ్యారు. దీంతో పాటు వరి పంటను వేసేందుకు బోరు బావల కింద రైతులు నారు మళ్లను సిద్ధం చేసుకున్నారు.రోహిణి కార్తె వెళ్లకముందే పంటలు వేసినట్లయితే సమృద్ధిగా పంటలు పండుతాయని రైతులు పొడి పదనులోనే భూమి పై పత్తి గింజలు పెట్టారు.దీంతో రైతులు ఆనందంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై కూలీలతో పనులు చేయించుకుంటున్నారు. అదేవిధంగా పలు ఫర్టిలైజర్ షాపుల వద్ద రైతులు విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

■ **కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ :**



ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈఓ రామి రెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, హౌజింగ్ పిడి గణపతిలతో కలసి ప్రజావాణి వినతులు స్వీకరించారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ రకాల సమస్యల సంబంధించిన 127 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. రెవెన్యూ శాఖ 51, పిడి హౌసింగ్ 12, జిడబ్ల్యూయంసి వరంగల్ 13 దరఖాస్తులు రాగా మిగత వివిధ శాఖలకు సంబంధించినవి 51 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరించాలని, సమస్య పరిష్కరించలేని సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని దరఖాస్తుదారునికి అర్థం అయ్యేలా చెప్పాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నిర్వహించిన గ్రీవెన్స్ లో స్వీకరించిన మొత్తం 11,221 దరఖాస్తులలో 10,349 దరఖాస్తులు పరిష్కరించగా 872 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వారిని కూడా త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన డిఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈవో జ్ఞానేశ్వర్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతి బిడ్డల శ్రేయస్సు కోసం మెపా కృషి చేస్తుంది

■ **పులి దేవేందర్ ముదిరాజ్**

**వేద న్యూస్, హన్మకొండ :**



ఇటీవల కాలంలో హన్మకొండ పట్టణం లోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన బైరి నితిన్ కుమార్ ముదిరాజ్ అనుమానస్పద రీతిలో మరణించడం జరిగింది. నాన్నమ్మ బైరి లచ్చమ్మ, తల్లి సునీతలు నితిన్ పైనే ఆధారపడి జీవనం సాగించేవారు.మగ దిక్కు లేకుండా ఇప్పుడు పూట గడవడం కష్టంగా ఉందని ఈ మరణ వార్తను మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ కీ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్‌లు చేరవేయగా ముదిరాజ్ ఉద్యోగులు,పెద్దలు రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది ద్వారా రూ.30 వేలు జమ చేసి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ చేతుల మీదుగా అందజేశారు.అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ జాతి బిడ్డల శ్రేయస్సు కోసం మెపా ఎల్లవేళలా కృషి చేస్తుందని,ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేసిన డోనర్స్ అందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి ముదిరాజ్ లు సంయుక్తంగా మాట్లాడుతూ..విద్య ఉద్యోగ సాధికారత కోసం మెపా ఎల్లవేళలా కృషి చేస్తుందని బైరి నితిన్ అన్న నిఖిల్ కు ఏదైనా ప్రవేట్ ఉద్యోగం మెపా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ..జిల్లాలో ఏ ముదిరాజ్ బిడ్డకు ఆపద వచ్చిన మెపా ముందు ఉంటుందని బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఇల్లు కోసం స్థానిక ఎమ్మెల్యే గారి సహకారం తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి ముదిరాజ్, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు,జిల్లా అధ్యక్షులు పులి రాజేష్,ఉపాధ్యక్షులు గోనెల విజేందర్,మండల సమ్మయ్య, పులి మహేష్,స్థానిక కుల పెద్దలు ఇప్ప సుక్కయ్య, పెద్దమ్మల సురేందర్,అశోక్, విక్రమ్,సురేష్, సాహిత్, బంటి, మణి,మహేష్, సాయి,రజనీకాంత్,రోహిత్, బాచి లతో పాటు కుటుంబ సభ్యులు బైరి సునీత, లచ్చమ్మ,నిఖిల్ లు పాల్గొన్నారు.

# సొంతిల్లు పేదవారి ఆత్మగౌరవ ప్రతీక

**మొదటి పేజీ తరువాయి**

పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకొని గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని మంత్రి కోరారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.అన్ని రంగాల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం ముందుకెళు తున్నామని, పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు.

నగరంలో స్లమ్ ప్రాంతాల్లో గుడిసెలు నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఇంచార్జ్ మంత్రిని కోరగా, లేఅవుట్ ప్రతిపాదన సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఆదేశించారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇల్లు మంజూరు చేస్తామని, పథకం అమలులో ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ ఇల్లు నిర్మించుకోవాలని, విడతల వారీగా మూడు విడతల్లో లబ్ధిదారుని ఖాతాలో నేరుగా 5 లక్షల రూపాయలు జమ అవుతాయని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. లబ్ధిదారుల కేవలం రవాణా చార్జీలు మాత్రమే భరించాల్సి ఉంటుందన్నారు. ఇది నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తూ ఉందని, తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రతి పేదవానికి ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. వరంగల్ పట్టణంలో లెనిన్ నగర్, బి ఆర్ నగర్ తదితర స్లమ్ ఏరియాలలో గుడిసెలలో నివసిస్తున్న పేదవారికి పట్టాలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు స్వీకరించిన లబ్ధిదారులు వచ్చే పది రోజుల్లోగా ఇండ్ల నిర్మాణాలకు గ్రౌండింగ్ చేయాలన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, చింతాకుల అనిల్ కుమార్, భోగి సువర్ణ, పోశాల పద్మ, కావేటి కవిత, బైరబోయిన ఉమా దామోదర్, యాదవ్ గుండు చందన పూర్ణ చందర్, ఓని స్వర్ణ లత, ఫుర్కాన్, బాల్నే సురేష్, బస్వరాజు కుమార స్వామి, సురేష్ జోషి, ఇందిరమ్మ ఇళ్ల జిల్లా నోడల్ అధికారి రామీ రెడ్డి, పిడి హౌజింగ్ గణపతి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఆర్ డిఓ సత్య పాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టర్‌కి ఘన సన్మానం

**వేద న్యూస్, వరంగల్ :**



అధికారులందరి సమష్టి కృషితో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంలో జిల్లాను ముందు వరసలో ఉంచుదామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ గా డాక్టర్ సత్య శారద బాధ్యతలు చేపట్టి సోమవారానికి విజయవంతంగా సంవత్సర కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు జిల్లా అధికారులు, కలెక్టరేట్, వివిధ శాఖల ఉద్యోగులు పుష్పగుచ్చాలు, పూల మొక్కలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో అధికారుల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను సాధించి జిల్లాను ముందు ఉంచడంలో కృషి చేశామన్నారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే, నేషనల్ హైవే, విమానాశ్రయం, నర్సంపేట జిల్లా ఆసుపత్రి తరతర ప్రతిష్టాత్మక కార్యక్రమాలను శ్రీకారం చుట్టి సునాయాసంగా తుది దశకు తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో అధికారులు పని చేయాలన్నారు.

అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ కలెక్టర్ డాక్టర్ సత్య శారద తన మెలకువలు, త్రికరణ శుద్ధి, ఏకాగ్రత, ప్రతి పనిలోనూ నిర్దిష్టంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడంలో కలెక్టర్ కనబడిచిన ప్రతిభ కారణంగానే జిల్లా అభివృద్ధి పథంలో వెళుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో

డిఆర్ఓ విజయలక్ష్మి, టీజీవో ప్రెసిడెంట్ జెడ్పి సీఈఓ రాంరెడ్డి, జనరల్ సెక్రెటరీ ఫణి కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్, డిపిఓ అనురాధ, వైస్ ప్రెసిడెంట్ డిసిఓ నీరజ, డిఆర్డిఓ కౌసల్యా దేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు కలెక్టర్ కు అభినందలు తెలిపారు.

## సైదులుకు రక్తదాత సుఖీభవ అవార్డు ప్రధానం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




అనుముల మండలం హాలియాలో సుమంగల్ ఫంక్షన్ హాల్ లో తల సేమియా బాధిత పిల్లల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొత్తపల్లి సైదులకు రక్తదాత సుఖీభవ అవార్డును ప్రదానం చేసి సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రక్తదానం చేస్తూ,తన మిత్రులతో,తెలిసిన రక్తదాత సోదరులతో రక్తదానం చేయించినందుకు గాను గుర్తింపుగా రక్తదాత సుఖీభవ అవార్డును ప్రధానం చేయడం జరిగిందన్నారు.ఈ అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యతను పెంచిందని,నాతోపాటు చుట్టుప్రక్కల ఉన్న ప్రతీ ఒక్కరికి రక్తదానం పట్ల అవగాహన కల్పిస్తానని,అత్యవసర సమయంలో రక్తం తక్కువయ్యి చనిపోకుండా కాపాడతానని, ప్రతి ఇంటికి ఒక రక్త దాత తయారు కావాలని కోరారు.ఈ అవార్డులను అందజేసిన అమిర్ ఆలీ ఫౌండేషన్ చైర్మన్ అమిర్ ఆలీ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.కాగా ఈ కార్యక్రమన్నీ రక్తదాన శిబిరాన్ని సీనియర్ కాంగ్రెస్ నేత,మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రారంభించారు.వారి చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేయడం జరిగింది.ప్రముఖ సామాజిక వేత్త శంషాబాద్ సిద్ధు రెడ్డి చేతుల మీదుగా నటుడు ఇంద్రసేన (ఫిల్మ్ హీరో) డా. మునిర్ తదితర ప్రముఖులు పాల్గొనగా వారి చేతులమీదుగా రక్తదాతలను సన్మానించడం జరిగింది.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహిస్తామని చేసిన వాగ్దానం అమలుకు ప్రభుత్వం ఏం ప్రయత్నం చేస్తున్నదని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో షెడ్యూల్ విడుదలవుతుందని ఆయా జిల్లాల్లో మంత్రులు తెలియజేస్తున్నారని కానీ బీసీ రిజర్వేషన్ గురించి మాత్రం ఎలాంటి ప్రస్తావన చేయడం లేదని అన్నారు. బీసీల రిజర్వేషన్ పై శాసనసభలో ఆమోదించిన బిల్లులు రాష్ట్ర గవర్నర్ ఆమోదించి కేంద్రానికి పంపించిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈబిల్లుపై స్పందించి,9వ షెడ్యూల్లో చేర్చేందుకు ప్రయత్నం చేయడం లేదంటే బిసిల యెడల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ పై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల, బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఏమైందన్నారు. రాష్ట్రంలోనిబిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు బీసీ రిజర్వేషన్ పై కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ఒప్పించలేక పోతున్నారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టనిచో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073